# క్రీస్తు సందేశము

గ్రంథకర్త

## యం. దేవదాసు అయ్యగారు

గుంటూరు - 2012 వెల : 3:00

Bible Mission HQ Guntur

# క్రిస్మస్ సందేశము

(లూకా 2:1-20)

1. యేసుప్రభువు యొక్క జన్మచరిత్ర నెమరునకు (అనగా జ్ఞాపకమునకు) తెచ్చుకొనుటవలన ఆత్మీయ జీవనవృద్ధికి సహాయకరముగా నుండును. నెమరువేయుట జీవరాసులకు హానికాదుగాని మేలే. ఆలాగుననే క్రీస్తు జన్మచరిత్రను ఎరిగియున్నను, స్మరణకు తెచ్చుకొనుటవలన ఆనందాభివృద్ధి కలుగును.

2. పండుగలు సంతోషాభివృద్ధికి ఉపయోగములు. ఈ లోకములో ప్రతిమానవునికి ఏదోఒక విషయములో విచారముండును. అనుదినము విచారమున్న యెడల ఆయుష్షు క్షీణించును గనుక అప్పుడప్పుడు పండుగలు ఆచరించ వలసినదే. ఆ సమయములో విచారము పూర్తిగా పోకపోయినను, కొంతవరకు తగ్గనైన తగ్గును. మానవుని యొక్క చరిత్రలో సంతోషకరమైన సంగతులు గలవు. **వీటిలో మిక్కిలి గొప్పది క్రీస్తు ప్రభువుయొక్క జన్మము.** కావున క్రీస్తు ప్రభువుయొక్క జన్మమును తలంచుట వలన విచారములు, కష్టములు మరచి ఆనందముతో సంపూర్ణస్థితి పొందుదుము.

3. దేవుడు మానవులను కలుగజేసినప్పుడు తనవలె పరిశుద్ధులనుగా కలుగజేసెను. గాని మంచి పాలలో విషపుచుక్క పడినట్లు, ఆది మనుష్యులలో పాపము ప్రవేశించినది. కాలక్రమమున జనులవృద్ధితోపాటు పాపముకూడ వృద్ధి పొందెను. దేవునికి తన సృష్టి చెడిపోవుట బహు విచారము గనుక పాపమును పరిహరించుటకు ఒక రక్షకుని పంపెదనని వాగ్ధానము చేసెను.

4. రక్షకుని పంపెదనని దేవుడిచ్చిన వాగ్ధానకాలము నుండి, రక్షకుడు వచ్చునప్పటికి నాల్గువేల సం॥లు గతించెను. ఈ నాల్గువేల సంవత్సరములోను దేవుడు మాటిమాటికి ఈ వాగ్ధానములను తన భక్తులకు వినిపించుచు వచ్చినందు వలన, ఆ వాగ్ధానములు అమావాస్య చీకటిరాత్రిలో ఆకాశమున తళుక్కు

తళుక్కుమని మెరియు నక్షత్రములవలె ప్రకాశించుచు, విశ్వాసులలో నిరీక్షణ నక్షత్రములను వెల్గించుచుండెను.

*5. సంవత్సరములు గతించుకొలది ఆ రక్షకుడు రావలెనను కోరిక విశ్వాసులలో ఊరుచుండెను.*

6. రక్షకుడుగా సర్వలోక రక్షకుడుగా ఎవరు రావలెను? దేవుడు దేవుడుగా వచ్చిన యెడల, నరులు రక్షింపబడుటకు బదులుగా భస్మమైపోవుదురు. గనుక అట్లు వచ్చుటకు వీలులేదు. దేవదూతలలో ఒకరు రావలసి వచ్చిన యెడల ప్రజలు భయపడి పారిపోవుదురు. అయినను వారు రక్షింపలేరు. ఒకవేళ మనుష్యులలో ఒకరు రక్షకుడుగా రావలెనిననూ, అంత పనికి తగిన వారెవరు లేరు. ఎంత గొప్ప భక్తుడైనను ఏదో ఒక లోపము కల్గియుండును. ఒకమనిషి మరొకమనిషిని రక్షించలేడు. అందరిని అసలే రక్షించలేడు. దైవభక్తుడు సహితము తనకుతాను భక్తిగా నుండగలడుగాని ఒక మనిషిని రక్షించుటకు సమర్ధుడుకాడు. ఒకవేళ రక్షకుడుగా ఒక నరుడు ఏర్పరచబడినా అతడు శాశ్వితుడుగా నుండలేడు. ***కనుక దేవుడు ఏదో విధముగా వీలుచేసుకొని రావలెను.*** ఆయన దేవదూత రూపము ధరించుకొని వచ్చిన ప్రజలు దగ్గరకు రారు. జంతురూపమున వచ్చిన రానివ్వరు, కొట్టుదురు. గనుక మనిషి రూపముననే రావలెను. అప్పుడు అందరు దగ్గరకు రాగలరు, చూడగలరు, ఇండ్లలో చేర్చుకొనగలరు, మాట్లాడగలరు, కష్టసుఖములు చెప్పుకొనగలరు.

7. దేవుడు మనుష్యులలో మనిషిగా జన్మించిన యెడల దేవుడు మా నిమిత్తమై జన్మించి, మాతో కలసి మెలిసి ఉండు రక్షకుడుగా వచ్చినాడని మనుష్యులు అతిశయింతురు, సంతోషింతురు. ఆయన ఆకాశములో జన్మించి, అక్కడే ఉండిన ప్రజలకు అందుబాటులో నుండడు. భూమిమీద జన్మించినచో మా భూమిమీద, మా దేశములో, మా మనుష్యులలో రక్షకుడు జన్మించినాడని ఆనందభరితులగుదురు. మనుష్యులలోని ఈ తలంపును, ఈ కోరికను దేవుడు ఎరుగును గనుక ఆయన మనుష్యుడుగానే వచ్చుటకు నిశ్చయించుకొనెను.

8. దేవుడు కలుగజేసిన మొదటి మనుష్యులు అనగా ఆదాము హవ్వలు, అనగా ఆదిదంపతులు, అనగా మనమొదటి తల్లిదండ్రులు, అనగా ఆదాము మన తండ్రి, హవ్వ మన తల్లి. మనమందరమును ఏ దేశపువారమైనను, ఏ జాతివారమైనను, ఏ భాష వారమైనను వారి సంతానమే. మనమందరము కలసి నరవంశమై యున్నాము. ***ఈ నరవంశములోనే దేవుడు రక్షకుడుగా రావలెను.*** నరులను రక్షించుటకు నరవంశస్థుడైయుండవలెను. ఆదాము, హవ్వల సంతతిలో కొన్ని యేండ్లకు షేము అను దైవజనుడు జన్మించెను. ఆయన వంశములో అబ్రాహామనే దైవజనుడు జన్మించెను. ఆయన వంశపువారు యూదులని పేరుపొందిరి. వారి సంతతిలో దావీదు అను ఒక రాజు జన్మించెను. ఆ రాజుయొక్క వంశములో మరియమ్మ అను ఒక కన్యకయును, యోసేపు అను నీతిపరుడైన ఒక పురుషుడును జన్మించిరి. వీరి జన్మకాలము వచ్చుసరికి రక్షణ వాగ్దానము వినిపించి నాల్గువేల సం॥లు అయినది.

9. ఈ మరియమ్మ గర్భమందే లోకరక్షకుడు జన్మించునని కొన్ని వందల ఏండ్ల క్రిందట ప్రవచింపబడెను. అది ఇప్పుడు నెరవేరి తీరవలెను. అది మాత్రమే కాక ఆ రక్షకుడు బేత్లెహేము అను గ్రామములో జన్మించవలెనను మరియొక ప్రవచనముగలదు. ఈ రెండు ప్రవచనములు నెరవేరిన యెడలనే రక్షకుడు జన్మించినట్లు అనేకులకు తెలియును. ఎంత గొప్పవారు జన్మించినప్పటికిని, కన్యకా గర్భమందు జన్మించని యెడలను, బేత్లెహేములో జన్మించిన యెడలను ఆయన లోకరక్షకుడు కానేరడు.

10. ఆ రక్షకుడు ఎటువంటివాడై యుండవలెను? **మొదటిది** దేవుడై యుండవలెను. **రెండవది** మనుష్యుడై యుండవలెను. **మూడవది** కన్యకా గర్భమున పుట్టవలెను. **నాల్గవది** ఆమె గర్భవతియగుట దైవప్రభావమువల్ల కావలెను. **ఐదవది** బేత్లెహేము అను ఊరిలో (పాలెస్తీనాలోని గ్రామములో) జన్మించవలెను. **ఆరవది** నరవంశమైనను, ఆ నరవంశములో యూదుల

జనాంగమందు జన్మించవలెను. ఈ గుర్తులు ఉన్నప్పుడే అతడు లోకరక్షకుడై ఉండగలడు. ఇది ప్రవచనానుసారమై యున్నది, బైబిలులో వ్రాతపూర్వకముగా నున్నది గాని, గాలికి ఎగిరిపోవు మాటలవలె లేదు.

11. జన్మ ప్రవచనములు నెరవేరు సమయము వచ్చునప్పటికి నజరేతు అను గ్రామములో మరియమ్మ అను ఒక కన్యకను దేవుడు సిద్ధపరచియున్నాడు. ఆమెకు ఆ సంగతి తెలియదు గాని తర్వాత తెలిసినది. అంతకు పూర్వము యోసేపను నీతిపరుడు ఆమెను పెండ్లిచేసికొనవలెనని ఏర్పరచుకొనెను. గాని వివాహము కాలేదు. ఇంతలో దైవప్రభావమువల్ల ఆమె గర్భవతి ఆయెను.

12. ఒక పక్షిని దేవుడు వృక్షముగా మార్చగలడా? ఒక వృక్షమును పక్షిగా మార్చగలడా? మార్చలేడు గదా! అలాగైన ఆది అంతములేని దేవుడు ఒక మనిషిగా ఎట్లు జన్మించగలడని కొందరు అడుగుచున్నారు. పక్షిని వృక్షముగా మార్చుట సృష్టిక్రమమునకు విరుద్ధము. క్రమమునకు విరుద్ధమైనది దేవుడు చేయడు. అది నైసర్గికముకాదు. నాలుగు ఐదులు, ఇరువై, అయియుండగా దేవుడు వాటిని పంతొమ్మిదిగా గాని ఇరువై ఒకటిగాగాని మార్చడు. అది న్యాయ విరుద్ధము. సమస్తమును దేవుడు చేయగలడనియు, ఆయనకు అసాధ్యమైనది ఏమియులేదనియు మనము నమ్మవచ్చును. అయితే దేవుడు మనుష్యుడుగా జన్మించగలడా? ఆదిలో దేవుడు మొదటి మనుష్యుని కలుగజేసినప్పుడు తన పోలికగా కలుగజేసెనని వ్రాయబడియున్నది. తనపోలికగా అనగా తనకున్న ప్రేమ, న్యాయము, పరిశుద్ధత, శక్తి, జీవము, స్వాతంత్ర్యము, జ్ఞానము మొదలైనవి పెట్టి మనుష్యుని కలుగజేసెను. అదియే దేవుని పోలిక. ***దేవుడు తన పోలికగల మనుష్యునిగా జన్మించుట సబబుగానే యుండును.*** ఇది సబబునకు వ్యతిరేకముగా లేదు. ఎందుకనగా దేవుని పోలిక మనుష్యుని పోలిక ఒకటే. కాకపోతే దేవుడు ఆకారములేనివాడు. మనుష్యుడు ఆకారము గలవాడు.

13. దేవుడు మానవుడుగా అవతరించుట అద్భుతములన్నిటిలోకెల్ల గొప్ప అద్భుతము. అద్భుతక్రియలు చూచుట మానవునికి బహు వినోదముగా నుండును. తర్వాత దేవుని ప్రేమను నరుడు తెలిసికొనును. 'నరునిమీద ఎంత ప్రేమ లేకపోతే ఆయన నరుడుగా జన్మించును' అని నరుడు ఆశ్చర్యపడి నమ్మును. నరునిమీద ఎంత ప్రేమ లేకపోతే పరలోక మహిమలో నుండవలసిన దేవుడు పాపాంధకారముతో నిండియున్న ఈ లోకమునకు వచ్చును! ఎంత ప్రేమ లేకపోతే దేవదూతలయొద్ద నుండవలసిన దేవుడు నరులయొద్దకు వచ్చివేయును! ఈ అద్భుత అవతారము దేవుని ప్రేమను వెల్లడించునదిగా నున్నది. అందుచేతనే పండుగ చేయుచున్నాము.

14. మరియమ్మ ఉన్న నజరేతు గ్రామము బేత్లెహేము అను గ్రామమునకు చాలాదూరము. ఆమె బేత్లెహేమునకు రావలసిన అవసరములేదు. ఆమె రాకపోయిన 'బేత్లెహేములో రక్షకుడు జన్మించును' అను ప్రవచనము నెరవేరదు. మొదటిది, ఆమె రావలసిన అవసరములేదు. రెండవది, వేరేపని అవసరమున్నను స్త్రీ అగుటచేత అంత దూరము నడచివెళ్ళదు. మూడవది, ఆమె గర్భవతియైయున్నది. గనుక అసలే అంత దూరము వెళ్ళదు. నాల్గవది, పెండ్లికాక పూర్వము గర్భవతియైనందున బిడియము గనుక ఇల్లు విడిచి బయటికిరాదు. మనుష్యుల కంటబడనిది పొరుగూరు ఎట్లు వెళ్ళగలదు!

15. ఏలాగైనను దేవుడు మరియమ్మను బేత్లెహేము తీసికొని రావలెను. '*కన్యక గర్భవతియగును*' అను ప్రవచనము నెరవేరినది. 'రక్షకుడు బేత్లెహేములో జన్మించునను' ప్రవచనముకూడ నెరవేరవలెను. ఏ వంకమీద ఆమెను తీసికొని వచ్చిన యెడల, ఆ ప్రవచనము నెరవేరును?

16. ఆ కాలమందు ప్రజలకు తెలిసిన ప్రపంచమంతటిని రోమా ప్రభుత్వమువారు పరిపాలించుచుండిరి. రోమాపట్టణము ఇటలీదేశములో నున్నది. అక్కడ ఔగుస్తు అను చక్రవర్తి ఉండెను. ఈయన సర్వలోక ప్రజాసంఖ్య వ్రాయవలెనని

ఒక ఆజ్ఞ ఆయా దేశముల అధికారులకు పంపెను. గనుక జనాభా లెక్క వ్రాయవలెను. అందరిపేర్లు ఆ జనాభాలో నుండవలెను. మరియమ్మ, యోసేపు అను వీరు యూదులు. యూదులయొక్క పద్ధతి ఏమనగా ప్రజాసంఖ్య కాలమందు వారియొక్క పూర్వీకుల గ్రామమువెళ్ళి, అక్కడ తమ గోత్రాను సారముగ పేరులు వ్రాయించుకొనవలెను. మరియమ్మ, యోసేపు అను వారియొక్క పూర్వీకుడైన దావీదు రాజుయొక్క జన్మగ్రామము బేత్లెహేమనే గ్రామము. ఇప్పుడు యోసేపు ఆ గ్రామమునకు వెళ్ళి తనపేరును, మరియమ్మ పేరును వ్రాయించుకొనవలెను. స్త్రీలు వెళ్ళవలసిన ఆచారములేదు. యోసేపు వెళ్ళిన చాలును. మరియమ్మ వెళ్ళకుండుటకు ఈ ఆచారము ఒక చిక్కుగా నున్నది. కాబట్టి ఏమి చేయవలెను. ఆమె వెళ్ళిన యెడలనే బేత్లెహేములో రక్షకుడు పుట్టునను ప్రవచనము నెరవేరును. జనాభా లెక్క వ్రాయించవలెననే తలంపు చక్రవర్తి హృదయములో పుట్టించిన దేవుడే, మరియమ్మలో కూడా బేత్లెహేము వెళ్ళవలెనను తలంపుకూడ పుట్టించవలెను. అప్పుడు ప్రవచనము నెరవేరును. ఆలాగుననే జరిగినది. ఏలాగనిన: తాను చేసికొననైయున్న యోసేపు బేత్లెహేము బయలుదేరిన యెడల తాను ఒక్కతే ఇంటి దగ్గరనుండుటకు ఇష్టపడక, నేనుకూడ నీతో వచ్చెదనని మరియమ్మ వెంటబడి వెళ్లెను. ***ఇట్లు మరియ, యోసేపు వెంటబడి వెళ్ళుట; కట్టడలోనిది కాదుగాని ఆమె ఇష్టములోనిది.*** దేవుడే ఆమెకు అట్టి ఇష్టమును పుట్టించెను.

17. రోమా రాజ్యమునకు ఔగుస్తు చక్రవర్తిగా నున్నప్పుడు, ఆయన చేతిక్రింద సిరియా దేశముగలదు. పాలెస్తీనా దేశము అనగా నజరేతు, బేత్లెహేము ఉన్న దేశము ఆ సిరియ దేశములో ఒకభాగము. ఆ సిరియ దేశమునకు కురేనియ అధిపతిగా నున్నప్పుడు ప్రజాసంఖ్య వ్రాయబడెననియు, అది మొదటి ప్రజాసంఖ్య అనియు బైబిలులో వ్రాయబడియున్నది. ఈ వ్రాతచూడగా, 'లోకరక్షకుడు జన్మించిన వృత్తాంతము నిజము' అని రుజువగుచున్నది. ప్రభుత్వము వారి వ్రాత పుస్తకములలో చూచిన యెడల బైబిలులోనున్న ఈ సంగతి కనబడును. ఈ రెండు సంగతులు ప్రభువుయొక్క జన్మమునకు రుజువులు.

18. సంగతి తేటగా నుండుటకు విశదముగా వ్రాయుచున్నాము. అప్పటి సర్వ ప్రపంచమును రోమా ప్రభుత్వము ఏలుచున్నది. దానికి చక్రవర్తి ఔగుస్తు. ఆ రాజ్యములో సిరియ దేశము గలదు. సిరియ దేశమునకు కురేనియ రాజు. ఆ సిరియ దేశములో పాలెస్తీనా దేశముకూడా కలిసియుండెను. ఆ పాలస్తీనాలోని గలిలయ పరగణా (జిల్లా)లో నజరేతు గ్రామమును, యూదయ పరగణాలో బేత్లెహేమను గ్రామమును ఉన్నవి. మనుష్యుల పేర్లు, దేశముల పేర్లు ఇంత స్పష్టముగా వ్రాయబడియున్నందువల్ల రక్షకుని జన్మవృత్తాంతము సత్యమని తెలిసికొనగలము.

19. సర్వలోక ప్రజాసంఖ్య అని బైబిలులో వ్రాయబడియున్నది. రక్షకుడు సర్వలోక రక్షకుడుగాని ఒక్క పాలెస్తీనాకే రక్షకుడు కాడు. **సర్వలోక ప్రజాసంఖ్య కాలమందు సర్వలోక రక్షకుడు పుట్టుట అనునది వినసొంపుగా నున్నది.** అది ఆలాగు టక్కున కుదిరినది. 'కాలము సంపూర్ణమైనప్పుడు రక్షకుడు జన్మించెను' అని పౌలు వ్రాతలలో నున్నది. ప్రజలు అనుకొన్న కాలములో ఆయన జన్మించలేదు గాని ప్రవచనాను సారముగా దేవుడు ఏర్పరచిన కాలములో జన్మించెను. ప్రతి దానికి సమయము కలదు. అట్లే క్రీస్తు జన్మమునకును సమయము కలదు.

20. ప్రజాసంఖ్య వ్రాయబడినప్పుడు ప్రభువు జన్మించెనని వ్రాయబడి యున్నది. ఇదికూడ వినుటకు వినసొంపుగా నున్నది. ఎందుకనగా లోకరక్షకుడు ప్రజలలో ఒకడు. ప్రజలపేరు వ్రాయబడినట్టు ఆయన పేరుకూడ వ్రాయబడవలెను. ఈ రెండు విషయములు పాపులకు ఆనందకరములు. లోకరక్షకుడు మా మనిషి అనియు, ఆయన పేరుకూడ మా పేరులలో ఒకటనియు ప్రజలు కాలక్రమమున తెలిసికొని ఆనందింపవలసినది. ఈ లోకరక్షకుని నామమువలననే మనము రక్షింపబడుదుము. 'మరి ఎవరివలనను రక్షణ కలుగదు. ఈ నామముననే మనము రక్షణ పొందవలెను. గాని ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము' అని లోకరక్షకుని గురించి బైబిలులో నున్నది. ఆ

లోక రక్షకునికి పుట్టిన వెంటనే పేరు పెట్టబడలేదు గాని పుట్టకముందే పెట్టబడెను. ఆ పేరు 'యేసు' అనుపేరు. 'యేసు' అనగా రక్షకుడని అర్ధము. ఆయనకున్న మరియొకపేరు 'క్రీస్తు'. 'క్రీస్తు' అనగా అభిషిక్తుడు. అనగా నియమింపబడినవాడు. అనగా రక్షణ ఉద్యోగమునకు రాజువలె అభిషేకించబడినవాడు. యేసుక్రీస్తు అనగా రక్షణ పనికి ప్రత్యేకముగా నియమింపబడినవాడు. ఆయన జన్మమునకు పూర్వము కొన్ని వందల యేండ్ల క్రిందట ఆయనను 'మెస్సీయా' అనేవారు (మెస్సీయా=క్రీస్తు= అభిషిక్తుడు). యేసుక్రీస్తు అనునామము స్వదేశ నామముకాదు, విదేశనామముకాదు. అది పరలోక నామము. **రక్షకుడు ఎట్లు పరలోకమునుండి వచ్చెనో, ఆలాగే ఆయన నామముకూడా పరలోకమునుండి వచ్చినది.** గనుక సర్వలోకమునకు ప్రతి దేశమునకు ప్రతి మనిషికి రక్షణ విషయము సరిపోవు నామమై యున్నది. అందుచేతనే ఈ నామమున తప్ప మరి ఏ నామమున రక్షణలేదని బైబిలులో వ్రాయబడియున్నది.

21. పరలోకములో జీవగ్రంథము అను ఒకగొప్ప గ్రంథము కలదనియు, ఆ గ్రంథములో ఎవరి పేరులు వ్రాయబడియుండునో వారు మోక్ష వారసులు అగుదురనియు బైబిలు బోధవలన కనబడుచున్నది. వారు భూమిమీద ఉన్నప్పుడే ఎప్పుడో ఒకప్పుడు, ఎక్కడో ఒకచోట, ఏ స్థితిలోనో ఒకస్థితిలో రక్షణకరమైన యేసుక్రీస్తు నామమును తెలిసికొనవలెను. అట్లు తెలిసికొనగల ఒక సమయమును దేవుడు ప్రతివానికి అనుగ్రహించును. ఔగుస్తు చక్రవర్తికాలమున జనాభాలో వ్రాయబడిన పేరుల సంఖ్యకంటె, యేసునామమునుబట్టి పరలోకమందు జీవగ్రంథములో వ్రాయబడు సంఖ్య చాల ఎక్కువ. గనుక ప్రతివారు జీవగ్రంథములో పేరులు వ్రాయించుకొనుటకు ముందుగా యేసునామమును తెలిసికొనవలెను. ఔగుస్తు కాలమందు ప్రజలు తమ పేరులు వ్రాయించుకొనుటకు తమ పూర్వీకుల పట్టణమునకు వెళ్ళవలెనను ఆజ్ఞ కాగానే, వెంటనే వెళ్ళి వ్రాయించుకొన్న విధముగానే, ప్రతివారును పరలోక జీవగ్రంథములో తమ పేర్లు వ్రాయించుకొనుటకు త్వరపడవలెను. ఆయనయందు విశ్వసించుటవలనను, ఆయనను స్మరించుటవలనను, ఆయనను ప్రార్థించుటవలనను ఈ భాగ్యము లభించును.

22. మరియమ్మయును, యోసేపును తమపేరులు వ్రాయించుకొనుటకు నజరేతునుండి బేత్లెహేమునకు అనగా ఉత్తరమునుండి దక్షిణమునకు చాలా దూరప్రయాణముచేసిరి. అప్పుడే ఆమె ప్రసవ దినములు నిండెను గనుక ఆమె లోకరక్షకుని కనెను. ఆ శిశువును బట్టతో చుట్టి పశువుల తొట్టిలో పరుండబెట్టెను. అప్పుడు ఆ దేశ ప్రాంతములోని యూదులకు ఈ వర్తమానము తెలియగానే వారువచ్చి ఆయనకు నమస్కరించిరి. ఆ తరువాత కొన్ని దినములకు తూర్పు దేశమునుండి అన్యులైన జ్ఞానులువచ్చి ఆయనకు నమస్కరించి వెళ్ళిరి. ఈ రెండు గుంపులవారు వచ్చుటవలన ఆయన సర్వలోక రక్షకుడని కనబడుచున్నది. ఎట్లనగా ఆయన యూదులలో జన్మించెను గనుక యూదులు ఆయన స్వజనులు. తూర్పు జ్ఞానులు పరజనులు అనగా యూదులకు పరజనులు. అనగా క్రీస్తుయొక్క స్వజనులును, యూదులయొక్క పరజనులునుకలిసి స్వజన సంఘము అయినదిగదా! సర్వలోకమునకు వీరు ప్రతినిధులుగదా! గనుక మొదటిలోనే క్రీస్తు జన్మవార్త ఉభయులకును తెలియబడినది.

23. ప్రభువుయొక్క జన్మవార్త ఒక సంతోషకరమైన వార్త. అది క్రీస్తు జన్మవార్త. మరియొక సంతోషకరమైన వార్త యూదులకును, అన్యులకును ఇది తెలియబడుట. తుదకు ఈ వార్త 2005 సం॥ల కాలము అడ్డబడి మనయొద్దకు వచ్చినది. ఇదికూడా సంతోషకరమైన వార్తయే. ఈ వార్త పాలెస్తీనా దేశము మొదలుకొని భూమిమీదనున్న అన్ని దేశములకు వెళ్ళినది. ఇదికూడా సంతోషకరమైన వార్తయే. ఈ వార్త ఇంకను పట్టణములకు, పల్లెలకు, ప్రతి మనిషియొద్దకు ఇంకా నడచి వచ్చుచున్నది. ప్రజలు అంగీకరించినను, అంగీకరించక పోయినను ఇంకను ప్రకటింపబడుచున్నది. ఈ వార్త వెళ్లిన దేశములలోను, పట్టణములలోను, పల్లెలలోను ఈ క్రిస్మస్ పండుగ చేయుచున్నారు. నేడు మనము కూడా ఈ పండుగ చేయుచున్నాము. ఈ పండుగ చేయుటకు క్రైస్తవులు డిసెంబరు 25వ తేది ఏర్పరచుకొన్నారు ***గాని పాపి ఎప్పుడు***

***మొదటిసారిగా ఈ వార్తవిని నమ్మి అంగీకరించునో, అప్పుడే అతని జీవిత కాలమునకు అది మొదటి క్రిస్మసు పండుగయైయుండును.***

24. యేసుక్రీస్తు ప్రభువునకు ముందుగా ఆయన రాయబారియైన యోహాను జన్మించెను. ఈ యోహానునుగూర్చి 'ఆ శిశువు ఎదిగి ఆత్మయందు బలముపొంది ఇశ్రాయేలుకు ప్రత్యక్షమగు దినము వరకు అరణ్యములోనుండెను' అని వ్రాయబడియున్నది. "ఆ దినములలో సర్వలోకమునకు ప్రజాసంఖ్య..." 'ఆ దినములలో' అనగా యోహాను జన్మించిన కాలము అని అర్థము. యేసు జన్మము నిజమని తెలియపర్చుటకు ఇదికూడ ఒక చరిత్ర సంబంధమైన ఋజువు.

25. మరియమ్మ సత్రములోనికి వెళ్లెనుగాని స్థలము దొరకలేదు. దొరికినయెడల ఆమె సత్రములోనే ప్రసవించి యుండును. ఇక ముందునకు *ఈయనను లోకము అంగీకరింపదు* అను దానికి ఇది ఒక ముంగుర్తైయున్నది. *ఈ లోకము సత్రము వంటిది.*

26. సత్రములో స్థలములేని ఆయనకు పశువుల తొట్టెలో స్థలము దొరికినది. అనగా లౌకికులు ఆయనను అంగీకరింపకపోయినను వినయ మనస్కులు, దైవాభిమానులు ఈయనను అంగీకరింతురు అనుటకు ఇది ముంగుర్తుగా నున్నది.

27. ఆయన బట్టతో చుట్టబడుట చూడగా, ఆయన ఎంత దేవుడైనను కాపుదల అవసరమైన మనుష్యమాత్రుడని దీనివల్ల తెలియుచున్నది. ఒక తల్లి ఉండుటయును, పరుండబెట్టు ఒక స్థలముండుటయును, కప్పుకొనుటకు బట్ట ఉండుటయునుబట్టి, ఈయన కేవలము మనుష్యుడే అని నమ్ముటకు వీలున్నది.

28. మన నిమిత్తమై దేవుడు చిరకాలమునుండి, రక్షకుని రాకడ వాగ్ధానములు వినిపించుచు వచ్చెను. మన నిమిత్తమే ఆ రక్షకుడు జన్మమెత్తవలసి వచ్చెను. మన నిమిత్తమై ఆయన మనుష్యుడను పేరు పొందవలసివచ్చెను. లోక రక్షకుడు మన నిమిత్తమై **అన్నియు** చేసినవాడైతేనే తప్ప లోకరక్షకుడై యుండజాలడుగదా!

29. శిశువునొద్దకు ఎవరుబడితేవారు వెళ్ళవచ్చును. ఎవరుబడితే వారు శిశువును ఎత్తుకొనవచ్చును. ఏమియు అనడుగదా! శిశువును సమీపించుట సులువే గదా! యేసుప్రభువు అను శిశువు పెద్దవాడై సేవలో ప్రవేశించినప్పుడు, 'నాయొద్దకు వచ్చు వానిని ఏ మాత్రము త్రోసివేయననియు, ప్రయాసపడి భారము మోయుచున్న సమస్తమైన వారలారా నాయొద్దకు రండి నేను మీకు విశ్రాంతి కలుగజేతుననియు', చెప్పి పిలిచినాడు, రానిచ్చినాడు. ఇప్పుడుకూడా ఆ పనినే చేయుచున్నాడు.

30. 'ఆ దినములయందు' లోకరక్షకుడు పుట్టెనని వ్రాయబడియున్నది. అనగా ప్రభువునకు ముందుగా జన్మించిన రాయబారియైన యోహాను దినములు అని అర్థము. యోహాను మానవుడు గనుక ఎంత భక్తుడైనను కాలమునకు బంధింపబడి యున్నాడు. ***లోకరక్షకుడు పురుషులయొక్క కాలపరిమితిలో జన్మించినందువలన ఆయనకూడ కాలమునకు బంధింపబడియున్నాడు.*** రక్షకుడు కాలమునకు బంధిపబడని దేవుడైనను, మన నిమిత్తము కాలమునకు బంధింపబడి, వినయ మనస్కుడైన యోగ్యుడు గనుక దైవరక్షకుడు కాలములేని స్థితిలోనుండి కాలముగల స్థితిలోనికి ప్రవేశించుటవల్ల; అనగా అంతవరకు తన్ను తాను తగ్గించుకొనుటవల్ల విధేయుడాయెను. ఇట్టివాడు రక్షకుడు కాకపోయిన, కాల బంధముగల నరులకు మరి ఎవడు రక్షకుడు కాగలడు!

31. సర్వలోకములోని ప్రజలును వ్రాతలోనికి వచ్చిన (రికార్డు) సమయమున రక్షకుడు జన్మించెను అని వ్రాయబడియున్నది. తాను ఇంకా లోకమునకు రక్షకుడుగా బయలుపడక పూర్వమే, తాను రక్షించుటకు వచ్చిన **'సర్వలోకము'** అనుమాట ఆయన జన్మ వృత్తాంత సందర్భమున వ్రాయబడినది. ఇది మంచి సూచన. ఇట్టి సూచన గలవాడు రక్షకుడుగాక మరి ఎవడు రక్షకుడు కాగలడు!

32. ప్రజల పేరులు రిజిస్టరులో వ్రాయు సమయమందు తన పేరుకూడా వ్రాయబడుటకు వీలగునట్లు సరిగా అప్పుడే జన్మించెను. ఈ రీతిగా

ప్రజలపేరుతో పాటు, తన పేరుకూడా సమాన పద్ధతిని వ్రాయించుకొనుటకు సమ్మతించుటవల్ల వినయ మనస్కుడైన విధేయుడాయెను. ఇట్టివాడు రక్షకుడు కాకపోయిన మరి ఎవడు కాగలడు!

33. ఈయన అధిపతులకు, రాజులకు, చక్రవర్తులకు మించిన (దేవుడు) అయినను, వారందరు ఆయన చేతిక్రింద ఉండవవలసిన వారని ఎంచుకొనుటకు వీలున్నను, ఔగుస్తు అనే చక్రవర్తి యొక్క పరిపాలన క్రిందకు వచ్చివేయుటవలన, అనగా అంత వినయ మనోవిధేయుడగుట వలన తన్ను తాను తగ్గించుకొనెను. ఇది ఏలాగున్నదనగా దేవుడు మనిషిఎదుట చేతులు కట్టుకొని నిలువబడినట్లున్నది. తన కూలి వానియెదుట అనగా పాలేరు ఎదుట మునుసబుగారు చేతులు కట్టుకొని నిలువబడినట్లు ఉన్నది. ఇట్టివాడు రక్షకుడు కాకపోయిన మరి ఎవరు కాగలరు!

34. మరియమ్మ అను కన్యకను ఈయనే కలుగజేసి యున్నాడు. ఆయనవల్ల సృజింపబడిన ఆమె ఆయనకు అనగా సృష్టికర్తకు తల్లియైనది. ఆయన అనగా సృష్టికర్త, సృష్టమును అనగా తాను కలుగజేసిన కన్యకను తల్లిగా అంగీకరించెను. అంతమట్టుకు తన్నుతాను తగ్గించుకొనెను. ఇట్టి విధేయుడు కాక మరి ఎవరు రక్షకుడు కాగలరు!

35. మరియమ్మకు భర్త కాబోవునట్టి యోసేపునకు ప్రభువు సృష్టికర్తయే. అయినను అతనిని తండ్రిగా గైకొనెను. అంతవరకు తగ్గించుకొన్న ఇట్టి మనోవిధేయుడు గాక ఎవరు రక్షకుడు కాగలరు!

36. దేవుడు ఒకరి వంశములోనికి రాకూడదు. జననము, మరణముగల నరవంశములోనికి అసలే రాకూడదు. నిరాకారులును, పరిశుద్ధులునైన దేవదూతల యొక్క వంశములోనికి వచ్చిన యెడల, అది కొంతవరకు బాగుండునుగాని పూర్తిగా నరవంశములోనికే వచ్చివేసి, యూదులకు పూర్వము రాజైన దావీదు వంశములోనికి వచ్చివేసియున్నాడు. తన్నుతాను అంతగా తగ్గించుకొన్న ఇట్టివాడు రక్షకుడుకాక మరెవరు రక్షకులు కాగలరు!

37. రక్షకుడు లోకవాసియనియు, నరవంశస్తుడనియు, నరపుత్రుడనియు పిలిపించుకొనుటకు సిగ్గుపడనివాడై లోకమునకు వచ్చెను. అంతవరకు తన్నుతాను తగ్గించుకొన్నవాడుకాక మరెవరు రక్షకుడు కాగలడు!

38. రక్షకుడు పుట్టుటకు సత్రములో స్థలము దొరుకలేదని వ్రాయబడి యున్నది. భూగోళమంతటిని కలుగజేసిన దేవరక్షకునికి, స్థలము దొరకకపోవుట బహు విడ్డూరముగానున్నది. ఇట్లు అనేకులచేత నిరాకరింపబడుటకు ఆయన సమ్మతించి, లోకమునకు వచ్చెను. అంతగా తగ్గించుకొన్నవాడు రక్షకుడు కాడా!

39. ఆకాశ, మహాకాశములు పట్టనివాడైనప్పటికిని, పశువుల తొట్టిలో ఇరుకుకొని పండుకొనవలసిన గతి లోకరక్షకునికి వచ్చినది. దీనికి సమ్మతించి అంతగా తగ్గించుకొని వచ్చెను. గనుక ఈయన రక్షకుడు కాడా!

40. రాజ గృహములలో పుట్టిన శిశువులు ఉయ్యాలతొట్టిలో పరుండియుండగా, ఈ దేవరక్షకునికి పశువులతొట్టియే ఉయ్యాలతొట్టి అయినది. దీనికి సమ్మతించి తగ్గించుకొన్న యేసుప్రభువు రక్షకుడు కాడా!

41. మహిమ మేఘములు ఆయనను ఆవరించియుండగా, నరశిశువులు కప్పుకొనవలసిన పొత్తిగుడ్డలు కప్పుకొనుటకు ఈ రక్షకుడు సమ్మతించెను. ఇంత వినయ మనుష్యుడు రక్షకుడు కాడా!

42. పశువులతొట్టిలో ఒక చిన్న స్థలములో ఆయన పరుండెను. ఆ స్థలమునకు బంధింపబడిన వాడాయెను. దేవునికి స్థలము అక్కరలేదు. అయినను, ఒక చిన్ని స్థలమునకు బంధింపబడి తన్నుతాను తగ్గించుకొన్నవాడు రక్షకుడు కాడా!

43. దేవునిని ఎవరును ముట్టుకొనలేరు. ఎందుకనగా ఆయన అగ్నివంటివాడు మరియు నిరాకారము గలవాడు. ఆకారముగల పాపి ఆయనను అసలే ముట్టుకొనలేడు. అయినను ఆయన ఆకారము ధరించుకొనిన నరశిశువాయెను. గనుక అందరు అనగా భక్తులు, భక్తిహీనులు ఆయనను

ముట్టుకొనవచ్చును. ఆయన అనగా శిశురక్షకుడు అందరిని ముట్టుకొననిచ్చునంతగా తగ్గించుకొనెను. గనుక రక్షకుడు కాడా!

44. ఎల్లప్పుడు పనిచేయువాడు, తాను సృజించిన సృష్టినంతటిని, మానవులను చూచుచున్నవాడునైన ఆయన పశువులతొట్టెలో విశ్రాంతిగా పరుండ వలసివచ్చెను. అంతగా ఆయన తగ్గించుకొనెను. ఆయన రక్షకుడు కాడా!

45. దేవుడు తాను సృజించిన సృష్టి యావత్తును, మానవులమైన మనలను, మనకున్న సమస్తమును కాపాడుచున్నాడు. ఆయనను కాపాడువారు ఎవరునులేరు. ఆయనకు కాపుదల అవసరములేదు. ఆయనకు చలిగాని, సూర్యుని వేడిమిగాని తగలదు. ఆయన క్రిందపడడు, ఆయనకు హానికలుగదు. దేవుడనగా అట్టివాడు. ఒకరిని ఆయన కాపాడువాడుగాని ఒకరివలన కాపాడబడువాడు కాడు. అయితే ఈవేళ ఆ గొప్ప రక్షకుడు తొట్టివలనను, పొత్తిగుడ్డల వలనను, మరియమ్మ అను తల్లి వలనను, యోసేపను తండ్రివలనను; అనగా వస్తువుల వల్లను, మనుష్యులవల్లను కాపాడబడవలసిన వాడాయెను. అంతవరకు తగ్గించుకొన్న ఆయన రక్షకుడు కాకపోయిన మరెవరు రక్షకుడు కాగలరు!

46. యేసుప్రభువు మరియమ్మకు తొలిచూలు కుమారుడని వ్రాయబడియున్నది. మరియమ్మ ఉన్న యూదాజనాంగమునకు దేవుడు పూర్వము ఒక ఆజ్ఞ ఇచ్చెను. అదేమనగా, ప్రతి గృహములోను పుట్టిన ప్రధమపుత్రుడు దైవసేవకు ప్రతిష్ఠింపబడవలెను. ఈ ఆజ్ఞకు యూదులందరు లోబడిరి. ఇప్పుడు ఈ రక్షకుడు ఎంత దేవుడైనను, మనుష్యుడే గనుక, అందులోను యూదా జనాంగములో జన్మించెను గనుక వారికివ్వబడిన ఆజ్ఞ ప్రకారము రక్షకునికి జరుగవలెను. సేవలన్నిటిలో ఏ సేవ గొప్పది? శరీరమునకు అనగా మనము ఇతరులయొక్క శరీరమునకు చేయు ఉపకారసేవ గొప్పదా? లేక వారి ఆత్మకుచేయు సేవగొప్పదా? ***శరీరమునకు సదుపాయము చేయుట అను సహాయము గొప్ప సేవయేగాని ఆత్మకు పాపము లేకుండా చేయు బోధనోపకారసేవ***

**అంతకంటే గొప్పది.** ప్రజలకు ధర్మము ఉపదేశించి, వారిని దైవమార్గముల యందు నడిపించునట్టి ఉపకార సేవ మహాగొప్పది. దైవభక్తి నేర్పించి, అభ్యాసము చేయింపగల ఉపకార సేవకు మించిన సేవలేదు. ఈ లోకములో అవసరమైన సహాయము చేయుటే, గొప్ప ఉపకార సేవ అయిన యెడల, మానవులు ఈ జీవితము చాలించిన తర్వాత మోక్షములో ప్రవేశింపగల సదుపాయములు నేర్పుట మరింత గొప్ప సేవ. రక్షకుడు దేవుడైనను, మానవ కుమారులవలె సేవకు ప్రతిష్టింపబడుట ఆయనకు తగ్గింపుకదా! అంతగా తగ్గించుకొన్న ఆయన రక్షకుడు కాకపోయిన మరెవరు రక్షకుడు కాగలడు!

47. రక్షకుడు లోకముచేత సేవ చేయించుకొనుటకు రాలేదుగాని ఇతరులకు సేవ చేయుటకు వచ్చెనని గ్రంథములో వ్రాయబడియున్నది. లోక రక్షకుడు రోగముతోనున్న వారిని బాగుచేయుటకు వచ్చెను. ఇది శరీరసేవ. ఇంతే కాకుండా మానవులకు మంచి విషయములలో మాదిరి చూపించుటకును, దైవ విషయములను తేటపరచుటకును, తుదకు సర్వలోక పాప పరిహారయజ్ఞముగ తన ప్రాణమును సమర్పించుటకును లోకమునకు వచ్చెను. **అట్టిసేవ మనుష్యాత్మకు అవసరమైన సేవ. నరులెవ్వరును నరులకు ఈ సేవచేయలేరు.** ఈ రక్షకుడు దేవుడును, మానవుడును అయినందువల్ల శరీరసేవ, ఆత్మసేవ రెండును చేయగలడు. తొలిచూలి కుమారుడు అనగా జ్యేష్టపుత్రుడు అయినందుకు ఈ గొప్ప సేవ సాగించగలడు. మరియమ్మ జ్యేష్టపుత్రుడు యూదులలోని జ్యేష్టపుత్రులందరికంటె ఎక్కువ సేవ అనగా వారెవ్వరును చేయలేని సేవ చేసినాడు. ఇట్టి సేవ చేయగలిగిన ఆయన రక్షకుడు కాడా!

48. మరియమ్మ, యోసేపులు తొట్టివైపు తొంగి చూచుచున్నారు. ఏమి చూచుచున్నారు? వారికి ఏమి కనబడుచున్నది? అపూర్వమైన ఒక మర్మము కనబడుచున్నది. దేవుడు నరశిశువుగా జన్మించుటే ఆ మర్మము. కన్యక కుమారుని కనుటయే ఆ మర్మము. చూచువారికి ఆయన దేవుడుగా కనబడకపోవుటయే ఆ

మర్మము. ***మర్మములన్నిటికన్నా ఇదే గొప్ప మర్మము. అట్టి మర్మము ఎదుట వారు కూర్చున్నారు. ఎంత ధన్యులు!***

49. మరణములేని దేవుడు నరజన్మ మెత్తుటవలన కాలముగలవాడై, నరులకాలములో ప్రవేశించుటవల్ల నరులకాలమునకు వన్నె తీసికొనివచ్చెను. ఆయన నరుల జీవిత కాలమును తన యొక్క కాల ప్రవేశముద్వారా; సద్వినియోగ కాలముగాను, సౌఖ్య కాలముగాను మార్చగలడు. ఆయన తన జన్మమువలన విశ్వాసుల జన్మమును సార్ధక జన్మముగా మార్చగలడు.

50. స్థలములేని దేవుడు స్థలములో ప్రవేశించెను. స్థలము అనగా బేత్లెహేము గ్రామములోని స్థలము అనగా పశువులతొట్టి అని అర్ధము. మనము ఉండవలసిన స్థలములలోనికి గూడ ఆయన ప్రవేశించుటవలన, విశ్వాసులయొక్క స్థలములు పవిత్ర స్థానములుగా మార్చబడును. మన గ్రామములలోనికి, పట్టణములలోనికి, ఇండ్లలోనికి ఆయనను రానిచ్చినయెడల ఆ స్థలములు పవిత్ర స్థానములగును. అవి ఆయనకు ప్రతిష్టింపబడిన స్థలములగును. భూమిమీదకి వెయ్యేండ్ల పరిపాలన కాలము రానైయున్నది. అదంతయు మంచికాలమే. అప్పుడు ఈ భూస్థలము మహాపరిశుభ్రముగా నుండును. ***క్రీస్తుప్రభువు ఆ కాలములో భూస్థలమును పరిపాలించుటనుబట్టి, కాలస్థలములు రెండును ఆశీర్వాదమయమై యుండును.***

51. రక్షకుని జన్మము ఔగుస్తు చక్రవర్తి కాలములో కలిగినందువలన ఆయన ఆ చక్రవర్తి పరిపాలనలోని మనుష్యుడాయెను. ఆయన మనుష్యులయొక్క పరిపాలనలో ఉండకూడని దేవుడైనను, మన నిమిత్తమై మనుష్యుడైనందుకు నర పరిపాలన పరుడాయెను. అనగా పాలితుడాయెను గాని వెయ్యేండ్ల కాలములో యేసుప్రభువే భూలోకమంతటికిని రారాజై పరిపాలించును. ఆయన పరిపాలన విశ్వాసులకు, అవిశ్వాసులకు సర్వవస్తు సమృద్ధిగల పరిపాలన, శాంతిపాలన అయియుండును.

52. **'యేసు'** అను పేరు ప్రజాసంఖ్య కాలమందు మనపేరులలో చేర్చబడెను. **విశ్వాసులారా! మీ పేరులకు ఆయన పేరు చేర్చిన యెడల మీ పేరులకు పేరు వచ్చును.** ఆయన పేరును బట్టియే మనము జీవింతుము. మన నామములు, ఆయన నామమును బట్టి జీవగ్రంథములో వ్రాయబడును.

53. సర్వలోక చక్రవర్తియగు ఔగుస్తుయొక్క పరిపాలనలో ఉన్న ప్రజలమధ్య యేసుప్రభువు జన్మించెను. వెయ్యేండ్ల పరిపాలన రాకముందు ఉన్న కాలమంతటిలో, భూలోకమంతట నివసించు విశ్వాసులయొక్క సంఘములకు, యేసుప్రభువు చక్రవర్తియైయుండును. ఈ సంగతి విశ్వాసులకు తెలియును, ఇతరులకు తెలియదు.

54. ఆయన శరీరరీతిగా పేదవాడాయెను. అనగా సర్వజనులకు కావలసినవి అన్నియు సృజించిన దేవుడు, మానవులకు కావలసిన సర్వవస్తువులను సృష్టించిన దేవుడు, మన నిమిత్తమై పేదవాడాయెను. భూలోకమంతయు ఆయన స్థలము. సత్రముకూడ ఆయన స్థలము. సత్రములో ఆయనకు చోటు దొరికినదా! ఎంత పేదరికము! ఔగుస్తు చక్రవర్తియొక్క బిడ్డలు, హేరోదు రాజుయొక్క బిడ్డలు శృంగారమైన ఉయ్యాల తొట్టిలో పరుండి ఊగుచుండగా, సర్వసృష్టికర్తకు పశువులతొట్టి గతి ఆయెను. ఎంత పేదరికము!

55. అయితే ఈ శిశువు, వెయ్యేండ్ల పాలనలో అందరికిని సమృద్ధి కలుగునట్లు భూమిని అనగా శపింపబడిన భూమిని ఆశీర్వాద భూమిగా మార్చును. ఆ కాలము రాకముందున్న ఈ కాలములో, విశ్వాసుల సంఘమునకు ఆయన ఏ కొదువయు లేకుండా చేసి 'యెహోవా నా కాపరి నాకు లేమి కలుగదు' అనుపాట పాడించుచున్నాడు. క్రిస్మసు దినమున పిల్లలకు మంచి బహుమానములు ఇచ్చుట అ సమృద్ధిని సూచించును. ***అయితే విశ్వాసికి అనుదినము బహుమానములే అనుదినము క్రిస్మసే.***

56. శిశువు, పొత్తి గుడ్డలు ధరించెనని వ్రాయబడియున్నది. అవును, వెయ్యేండ్ల పాలనలో ఎవరికిని బట్టలకు కొదువయుండదు. విశ్వాసులకు ఇప్పుడు అప్పుడు నీతివస్త్రములకు కొదువ ఉండదు.

57. యేసుప్రభువు మరియమ్మకు జ్యేష్టపుత్రుడు. ఆయన సర్వలోక జనులయొక్క రక్షణార్థమై సమర్పణయైన జ్యేష్ట పుత్రుడు. జ్యేష్టుల సంఘము పరలోకమున ఉన్నది. మనము అక్కడికి పిలువబడి యున్నాము. మరియమ్మ యొక్క జ్యేష్ట పుత్రునివల్ల మనము దేవునికి జ్యేష్టపుత్రులము కాగలము. ఇట్టి గొప్ప భాగ్యము ఈ శిశువువల్ల మనకు దొరుకును.

58. యేసుప్రభువు పాపములేనివాడుగా జన్మించెను. ఆయన వలన మనకు పునర్జన్మము కలుగును. ఒక కాలము వచ్చును. ఆ కాలమందు మనము పాపము చేయలేని స్థితిని కల్గియుందుము. ఆ స్థితిని గురించి బైబిలులో ఇట్లు వ్రాయబడియున్నది. "దేవునిమూలముగా పుట్టిన ప్రతివానిలో ఆయన బీజమే నిలుచును గనుక వాడు పాపము చేయడు. వాడు దేవుని మూలముగా పుట్టిన వాడు గనుక పాపము చేయజాలడు." (1యోహాను 3:9).

ఈ క్రిస్మస్ సందేశ దీవెనలన్నియు మీలో మెండుగా నెరవేరునుగాక! ఆమేన్.

| | | | | |
|---|---|---|---|---|
| ప్రథమ | ముద్రణ | 2004 | ప్రతులు | 3000 |
| రెండవ | ముద్రణ | 2007 | ప్రతులు | 5000 |
| మూడవ | ముద్రణ | 2012 | ప్రతులు | 5000 |


ఇది దేవుడు, యం. దేవదాసు అయ్యగారికి బైలుపరచిన

## బైబిలు మిషను ప్రచురణ


ముద్రణ :

బైబిలు మిషను ప్రెస్, పెదకాకాని, గుంటూరు - 522 509.

ఫోన్:0863-2556149; 9949121777.


Bible Mission HQ Guntur